క్లుప్తంగా

నేడు మెగా రక్తదాన శిబిరం

రేగొండ: మండల కేంద్రంలో నేడు(శుక్రవారం) నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పుల్లూరి బాబురావు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్త శిబిరాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు.

సన్మానం



మొగుళ్లపల్లి: జిల్లా కేంద్రంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ పండుగ శ్రీనివాస్‌యాదవ్, చైర్మన్ తక్కళ్లపెల్లి రాజు కమిటీ సభ్యులు గురువారం ఎమ్మెల్యేను గండ్ర సత్యనారాయణరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కబడ్డీ క్రీడా కమిటీకి అన్ని విధాలుగా ఎల్లవేళలా సహాయసహకారాలు, అందిస్తామని అన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా రఘుపతిరావు



వాజేడు: సీపీఎం మండల నూతన కార్యదర్శిగా కొప్పుల రఘుపతిరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో నిర్వహించిన సీపీఎం మండల 9వ మహాసభల సందర్భంగా రాష్ట్ర పార్టీ నాయకుల సమక్షంలో రఘుపతిరావును నూతన కార్యదర్శిగా ప్రకటించారు. ఆయనతో పాటు మరో 23 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. కొప్పుల రఘుపతి రావు సీపీఎం మండల కార్యదర్శిగా ఎన్నికవ్వడం వరుసగా ఇది మూడవ సారి.

కమిటీ ఎన్నిక



ములుగు: తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్‌జేయూ) కమిటీని ఎన్‌యూజే జాతీయ ఉపాధ్యక్షుడు నారగొని పురుషోత్తం, టీఎస్‌జేయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శిగా చల్లగురుగుల రాజు, సంగ రంజిత్, గౌరవ అధ్యక్షుడిగా నగేష్, ఉపాధ్యక్షులుగా నరేష్, హరినాదం, మహేందర్, కిరణ్, జాయింట్ సెక్రటరీగా హరీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రాజు, హజీజ్, జగన్, రాజు, కోశాధికారిగా స్వామి, ఈసీ సభ్యులుగా కుమారస్వామి, అనిల్‌కుమార్, సామరాజు, కోటి ఎంపిక య్యారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా జర్నలిస్టులు ఆర్థిక, సామాజిక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ముందుకురావాలని కోరారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను శాలువాలతో సన్మానించారు. సమావేశంలో శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక ప్రచారం

పలిమెల: ఎస్ఎస్ఆర్ 2024–25లో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 9, 10వ తేదీల్లో మండలంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సయ్యద్ సర్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 18 సంవత్సరాలకు పైబడిన యువత విధిగా ఓటరుగానమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు బీఎల్ఓ (అంగన్‌వాడీ టీచర్) సంప్రదించాలని కోరారు.

ఆర్థికసాయం

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన కొల్లూరి బాబు అనే వ్యక్తి ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గ్రామస్తులు పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యువకులు, మహిళలు, తదితరులు ఉన్నారు.

పరామర్శ



రేగొండ: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన గణపాక సూరమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు మనోహర్ రావు పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట యూత్ నాయకులు రమేశ్, శ్రీకాంత్ ఉన్నారు.

ప్రమాదకరంగా వంతెన

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



వంతెనపై గుంతలు ఏర్పడి తేలిన ఇనుప చువ్వలు

మల్హర్: మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని దబ్బగట్టు శివారులో ఆరెవాగుపై నిర్మించిన ఆరెవాగు వంతెన ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం వంతెనపై పలు చోట్ల భారీగా గుంతలు ఏర్పడి, రాడ్లు పైకి తెలాయి. ఈ రహదారి నుంచి తాడిచర్ల, మల్లారం మీదుగా మంథని, కాటారం వైపు నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. వంతెనపై గుంతలు పడి ఇనుప చువ్వలు పైకి రావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు జంకుతున్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో వంతెనపై ఏర్పడిన గుంతల్లో నీళ్లు నిలుస్తున్నాయి. దీంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వంతెనపై ఉన్న గుంతలపై తాత్కాలికంగా మట్టితో నింపి సంబంధిత అధికారులు చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత మరమ్మతులు చేపట్టడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. దీనికి తోడు తాడిచర్ల నుంచి కొయ్యూరు నాగులమ్మ వరకు ఉన్న డబుల్ రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడటంతో రోడ్డుపై ప్రయాణించడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు, రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సమగ్ర సర్వేకు సహకరించాలి



మాట్లాడుతున్న గొంది దివాకర్

గోవిందరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కులగణన సర్వే చేయడానికి ఇంటికి వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని మండల విద్యాధికారి గొంది దివాకర్ అన్నారు. కులగణన సర్వేలో భాగంగా గురువారం మండల కేంద్రంలో ముందస్తుగా ఇంటింటికీ కుటుంబాల ఆధారాల కోసం స్టిక్కర్లు వేసిన ఎన్యుమరేటర్ల పనితీరును పరిశీలిస్తూ కుటుంబ యజమానులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గొంది దివాకర్ మాట్లాడుతూ.. ఈ నెల 9 నుంచి ప్రారంభమయ్యే కులగణన సర్వేలో ఇంటికి వచ్చే అధికారులతో ఇంటి యజమానులు సహకరించాలన్నారు. అధికారులు అడిగే అన్ని ప్రశ్నలకు వివరాలు తెలియజేయ్యాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డేగల శంకర్, సర్వే టీం సూపర్‌వైజర్ రఘురాం, ఎన్యుమరేటర్లు కంతం రవి, రాజారాం, రమేష్, అశోక్, శివ, దీప్తితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో నిలిచిపోయిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సద్దాం హుస్సేన్ అన్నారు. గురువారం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో నిర్మించ తలపెట్టిన 100 డబుల్ బెడ్ రూం ఇళ్లు మధ్యంతరంగా నిలిచిపోయాయని అన్నారు. నిరుపేదలు ఇంటి కిరాయిలు చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నారని డబుల్ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన పేదలకు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేందర్, ప్రవీణ్, రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కులగణనను అడ్డుకుంటాం..



మాట్లాడుతున్న నాగరాజు

వాజేడు: షెడ్యూల్డ్ ఏరియాలో బీసీ కులగణనను అడ్డుకుంటామని ఆదివాసీ నవ నిర్మాణ సేన మండల అధ్యక్షుడు మొడెం నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. షెడ్యూల్ ప్రాంత విచ్ఛిన్నానికి రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతుందని ఆరోపించారు. ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణన ఐదవ షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలను ఉల్లంఘించేలా ఉందన్నారు. నిషేదించబడిన వలస గిరిజనేతరుల కులగణన చేపట్టడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. షెడ్యూల్డ్ ఏరియాలో ప్రభుత్వానికి ఎలాంటి పరిపాలన అధికారం లేదన్నారు.

మెస్ చార్జీల పెంపుపై హర్షం



సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థినులు

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాల విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం హర్షణీయమని ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. గురువారం మండలంలోని దేవగిరిపట్నం మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని ప్రదర్శిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.2100 పెంచిందని అన్నారు. గతంలో విద్యార్థులకు రూ.1500 చెల్లించేదని అన్నారు. కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో నిరుపేద విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. 13 సంవత్సరాల తరువాత డైట్ చార్జీలు పెంచడంతో విద్యార్థినులకు న్యూట్రీషన్ ఫుడ్ అందించేందుకు వీలుగా ఉంటుందని అన్నారు.

నిధులు విడుదల చేయాలని వినతి



పీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కన్నాయిగూడెం: మండలంలోని ఐలాపూర్ గ్రామంలో నిర్వహించే సమ్మక్క–సారక్కల జాతర ఏర్పాట్ల కోసం నిధులు విడుదల చేయాలని ఏటూరు నాగారం ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రకు పూజారుల సంఘం నాయకుడు పీర్ల భాస్కర్ గురువారం వినతిపత్రం అందించారు. జాతర సమయంలో సీటివసతి, రోడ్లు, స్నాన గట్టాలు, గద్దెల ప్రాంగణంలో సుద్ది మొదలగు వసతులకు నిధులు విడుదల చేయాలని కోరారు. ఆయన వెంట పీర్ల సురేష్ ఉన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్



పరామర్శిస్తున్న లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం: కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. మండలంలోని కొండాయి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లెల మూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గురువారం పార్టీ నాయకులతో కలిసి ఆయన పరామర్శించి రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే పార్టీ కార్యకర్త అట్టెం నాగరాజు ఇటీవల మృతి చెందగా అతడి కుటుంబాన్ని పరామర్శించి రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు. మండల అధ్యక్షుడు సునీల్ కుమార్, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు తాటి కృష్ణ, ప్రదీప్‌బాబు, రామయ్య, కుమ్మరి చంద్రబాబు, బోజారావు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

‘నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు’

ములుగు రూరల్: మండలంలోని కాశిందేవిపేట–అంకన్నగూడెం గ్రామాల మధ్య నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనుల్లో గుత్తేదారు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని సీపీఎం మండల కార్యదర్శి ఎండీ గఫూర్ పాషా ఆరోపించారు. గురువారం బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రోడ్డు పనులు ప్రారంభించి 20 రోజులు గడుస్తున్న గుత్తేదారు కంకర పోసి ఎలాంటి రోలింగ్ చేయడం లేదని, నీళ్లు కొట్టించడం లేదని అన్నారు. కంకర పోసి రోలింగ్ చేయకపోవడం, నీళ్లు కొట్టించకపోవడంతో దుమ్ముధూళి వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తుందని అన్నారు. మండలంలో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనుల్లో గుత్తేదారులు పందికుంట క్రాస్ నుంచి పందికుంట గ్రామం వరకు కంకర పోసి రెండు నెలలు గడుస్తుందని, శ్రీనగర్ క్రాస్ నుంచి రాంచంద్రాపురం రోడ్డు, అన్నపల్లి నుంచి దేవగిరిపట్నం గ్రామాల మధ్య నిర్మిస్తున్న రోడ్డు పనులు పూర్తికాక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండబోయిన రవిగౌడ్, జన్ను దేవేందర్, శోభన్, నారాయణ, సర్వేశం, రమేశ్, ముత్తారావు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత



ఫోన్ అందజేస్తున్న పస్రా ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా గ్రామానికి చెందిన సాయి భరత్ రెండు నెలల క్రితం గోవిందరావుపేట నుంచి వస్తుండగా ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ మేరకు పస్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను రికవరీ చేసి గురువారం బాధితుడికి ఎస్సై కమలాకర్ అందజేశారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదిస్తే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించవచ్చని ఎస్సై తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



కాటారం: వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

కాటారం: మండల కేంద్రానికి వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుకు అతిథి అధ్యాపకులు, కేజీబీవీ ఉపాధ్యాయులు తమ సమస్యలు పరిష్కరించాలని గురువారం వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు టీజీపీఎస్సీ ద్వారా నియమించబడే లెక్చరర్లతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అతిథి అధ్యాపకుల గౌరవ వేతనాన్ని పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనం పెంచాలని గెస్ట్ లెక్చరర్లు మంత్రికి విన్నవించారు. కేజీబీవీల్లో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనం కల్పించాలని కేజీబీవీ యూనియన్ ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాలు సమర్పించిన వారిలో గెస్ట్ లెక్చరర్లు కర్ణాకర్, శైలజ, నాగలక్ష్మి, పోచయ్య, పిన్నయ్య, కేజీబీవీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చల్ల సునీత, సభ్యులు విజయ, రాజేశ్వరీ, నళిని, కవిత పాల్గొన్నారు.

ఆర్టిజన్‌లను కన్వర్షన్ చేయాలని వినతి

కాళేశ్వరం: తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ కమిటీ జయశంకర్ భూపాలపల్లి (టీవీఏసీజేఏసీ) తరఫున కో చైర్మన్ లేతకారి రాజయ్య, కోకన్వీనర్ కోసరి భాస్కర్ ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్స్‌లను కన్వర్షన్ చేయాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు గురువారం మెమోరాండం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి ఆర్టిజన్‌ల కన్వర్షన్‌పై ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తులసిగిరి సమ్మయ్య, చందా సతీష్, నారుమల్ల రవి, దనుష్, విద్యాసాగర్, సుధాకర్ వేణు పాల్గొన్నారు.

బియ్యం అందజేత



కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయి గూడేనికి చెందిన కావిరి మల్లయ్య, కుమ్మరి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించి బియ్యం అందజేశారు. మాజీ సర్పంచ్ కావిరి పద్మ, జిల్లా నాయకుడు కావిరి చిన్నికృష్ణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సునారికాని వెంకటయ్య,సీనియర్ నాయకులు నర్సింహారావు, మల్లయ్య, కావిరి సమ్మయ్య, నాగరాజు, నాగార్జున్, కుమ్మరి రాజబాబు, కొండగొర్ల వెంకటయ్య ,జాడి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణ స్థలాన్ని కాపాడాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ములుగు రూరల్: మండలంలోని బండారుపల్లి శివారులో అంబేడ్కర్ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కాపాడాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రవి అన్నారు. ఈ మేరకు గురువారం ఆర్డీఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ భవన నిర్మాణానికి 267/1 సర్వే నంబర్‌లో 20 గుంటలు, 351/10లో 07 గుంటలు భూమి కేటాయించారని అన్నారు. 07 గుంటల భూమిని అధికారుల అండదండలతో కబ్జా చేసి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని అన్నారు. అధికారులు విచారణ చేపట్టి కబ్జాకు గురైన భూమిని తిరిగి అంబేడ్కర్ భవనానికి కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు జన్ను రవి, ఎమ్మార్పీఎస్ నాయకుడు నద్దునూరి రమేశ్, బోడ రాములు, నెమలి నర్సయ్య , ఓరుగంటి అనిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాలకు రుణాలు ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న నాయకులు, రైతులు

కాటారం: గత ప్రభుత్వాలు ఆదివాసీ గిరిజనులకు ఇచ్చిన పోడు పట్టాలకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం మహాముత్తారం మండలకేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పోడు పట్టాలకు ప్రభుత్వం పోడు హక్కు పత్రాలను మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఈ భూముల్లో ఆదివాసీ, గిరిజనులు పంటలు సాగు చేస్తున్నారని పెట్టుబడుల కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయకపోవడంతో పంట పెట్టుబడి కష్టమవుతుందని పేర్కొన్నారు. వెంటనే బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకముందు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మార్క రాముగౌడ్, రాదారపు స్వామి, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కుక్క కాటుకు గురై ప్రాణాపాయ స్థితిలోకి..



కుక్క కాటుతో కాలుకి అయిన గాయం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రజిత

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని మంజూర్ నగర్‌లో కుక్క కాటుకు గురైన మహిళ ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంజూర్‌నగర్‌లోని బీసీ కాలనీకి చెందిన గరిశాల రజితను 15 రోజుల క్రితం ఇంటి ఎదుట రోడ్డుపై కుక్క కరిచింది. స్థానికంగా వైద్య సేవలు అందించినప్పటికీ నయం కాకపోవడంతో పాటు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రూ.15లక్షల ఖర్చు అయినప్పటికీ ఎటువంటి మార్పు కనిపించక పోవడంతో అప్పులు చేసి వైద్య అందించి చేసేదేమి లేక గాంధీ ఆస్పత్రికి మార్చారు. రజిత కోమాలో ఉండడంతో డాక్టర్లు ఎప్పుడు నయం అవుతుందో చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం ఆదుకొని మెరుగైన వైద్యం అందించాలని కాలనీ అధ్యక్షుడు బడితల శ్రీధర్ కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం



క్షతగాత్రుడు శ్రీకాంత్

గోవిందరావుపేట: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని చల్వాయి బస్టాండ్ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చల్వాయిలోని జాతీయ రహదారి 163పై బుస్సాపూర్‌కు చెందిన శ్రీకాంత్, దేవరాజ్ చల్వాయికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ సతీష్ ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కాగా హుటాహుటిన ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, దేవరాజ్ పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. జాతీయ రహదారిపై సెంటర్ లైట్లు రాకపోవడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు వాపోయారు. జాతీయ రహదారిపై సిగ్నల్స్ లైట్లు, సెంటర్ లైట్లు రావడం లేదని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించకోడం లేదని తెలిపారు. జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాలకు సంబంధిత అదికారులు, సిబ్బంది, సదరు కాంట్రక్టర్ల నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



అంకూస్‌ను సన్మానిస్తున్న సహ ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: మండలంలోని నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసి మెట్టుపల్లి పాఠశాలకు బదిలీపై వెళ్లిన కొత్తూరి అంకూస్‌ను గురువారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నసిరోద్దీన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంఈఓ లింగాల కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. అన్ని వృత్తుల్లో కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ అనసూర్య, మాజీ సర్పంచ్ సతీష్, ఉపాధ్యాయులు కృష్టారెడ్డి, రవీందర్, శ్యామలదేవి, తదతరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపర్లపై అధికారుల దౌర్జన్యం

కాళేశ్వరం/పలిమెల: మహదేవపూర్ మండలంలోని రాపల్లికోట గ్రామానికి చెందిన కొంతమంది మేత కోసం గొర్రెలను కాపర్లు పలివెల మండలం బూరుగుడెం గ్రామానికి వలస వెళ్లగా వారి వలలను దౌర్జన్యంగా అటవీశాఖ అధికారులు తిట్టుకుంటూ జాలీలను తొలగించారని యాదవ సంఘం నాయకులు గురువారం ఆరోపించారు. గొర్రెల రక్షణ కోసం పడుకో పెట్టడానికి చుట్టూ వలలు(జాలీ) వేసుకొని ఉన్న సమయంలో గురువారం తెల్లవారుజామున కొంతమంది ఫారెస్ట్ అధికారులు వచ్చి అడవిలో గొర్రెల రక్షణ కోసం ఎవరిని అడిగి జాలీలు పెట్టుకున్నరని గొర్ల కాపర్లపై వారు ఇష్టం వచ్చినట్లు తిడుతూ వలలో జాలీలు తీసి వేసి వేసి దౌర్జన్యం చేశారని గొర్రెలకాపర్లు ఆరోపించారు. ఈ సందర్భంగా గొర్రెల కాపర్లు మాట్లాడుతూ.. మేత కోసం వలస వెళ్లిన తమను ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యం చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. తాము ఫారెస్ట్ భూములను దున్నుకోవడం లేదని, కేవలం మేత కోసం గొర్రెల రక్షణ కోసం జాలీలు వేసుకున్నామన్నారు. ఫారెస్ట్ భూములకు గాని, చెట్లకు గాని ఎలాంటి హాని చేయలేదని గొర్రెల కాపర్లు తెలిపారు.